క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలోకి బీజేపీ నాయకులు



కండువాలు వేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని మాధవమాల గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి సయ్యద్ కరీముల్లా ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బీజేపీ నాయకులు శ్రీరాములు, సురేష్, మునిశేఖర్‌రెడ్డి తదితరులకు మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు భాస్కర్ రెడ్డి, ముని తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహారావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో 17 లేఔట్లలో నిర్మిస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ హాల్‌లో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో కల్పించనున్న మౌలిక వసతులపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఏఓ త్రివిక్రమ్‌రావు, ఏఈ సుబ్రమణ్యం, సిబ్బంది యుగంధర్, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



బుచ్చినాయుడుకండ్రిగ: కాళంగి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను వీఆర్ఓ భాస్కర్ శుక్రవారం పట్టుకుని, తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కాళంగి నదిలో ఇసుక రీచ్‌లు లేవన్నారు. తహసీల్దార్ భార్గవి మాట్లాడుతూ కాళంగి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. రెండు సార్లు పట్టుబడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కళాశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఏర్పేడు: గ్రామాల పరిశుభ్రతతో ఆరోగ్యం సాధ్యమని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి షమీర్ అన్నారు. మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ముళ్లపొదలు, చెత్త తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మురుగునీటి కాల్వలు శుభ్రం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామాంజులు, నారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కోర్టు భూమిలో ప్రవేశించొద్దు



జేసీబీ యంత్రాలను అడ్డుకుంటున్న వీఆర్ఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కుక్కంబాకం రెవెన్యూలో కోర్టు పరిధిలో ఉన్న భూమిలోకి ప్రవేశించి, చెట్టు, పుట్టలను తొలగించవద్దని తహసీల్దారు భార్గవి తెలిపారు. శుక్రవారం కుక్కంబాకం రెవెన్యూలోని సర్వే నంబర్ 81లోని 39 ఎకరాల 76 సెంట్ల భూమిలోని చెట్టు, పుట్టలను తొలగిస్తున్న జేసీబీ యంత్రాలను తహసీల్దారు భార్గవి ఆదేశాల మేరకు వీఆర్ఓ వెంకటయ్య అడ్డుకుని, పనులను నిలిపివేశారు. తహసీల్దార్ భార్గవి మాట్లాడుతూ ఈ భూమికి సంబంధించి 30 ఏళ్లుగా కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని తెలిపారు. కోర్టులో కేసు క్లియర్ అయ్యే వరకు భూమిలో ప్రవేశించకూడదని తెలిపారు. ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా కోలా ఆనంద్



కోలా ఆనంద్

రేణిగుంట: శ్రీకాళహస్తికి చెందిన కోలా ఆనంద్‌కుమార్ బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా శుక్రవారం నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర మీడియా కో–ఆర్డినేటర్‌గా ఉన్న ఆయన్ను రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి రాష్ట్ర కార్యదర్శిగా సఫార్సు చేశారు. బీజేపీ అధిష్టానం ఆమె సిఫార్సు మేరకు ఆయన్ను రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్వాతంత్య్ర వీరులను స్మరించుకుందాం

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి
- 'నా భూమి– నాదేశం'లో మట్టి సేకరణ





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, గాజులమండ్యంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: స్వాతంత్య్ర సమరంలో ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకుందామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మండల కార్యాలయంలో శుక్రవారం నా భూమి–నాదేశం, నేలతల్లికి నమస్కారం, హరితవీరులకు వందనం అనే కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మట్టిని సేకరించి భూమి, దేశం గొప్పతనాన్ని తెలిపే విధంగా దేశ రాజధాని ఢిల్లీకి పంపిస్తున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వాతంత్య్ర సమరంలో పాల్గొని అసువులు బాసిన వారు ప్రతి చోటా ఉన్నారని చెప్పారు. దానికి గుర్తుగా వారు పుట్టిన ప్రాంతంలో మట్టిని సేకరించి ఢిల్లీకి పంపుతున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. రాజు మంచి వాడు అయితే రాజ్యం సుభిక్షంగా ఉంటుందన్నారు. జగనన్న పాలనలో రాష్ట్రం బాగుందన్నారు. సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చారని గుర్తుచేశారు. అభివృద్ధి జరగడం లేదని చంద్రబాబు చెప్పడం విడ్డూరమని ఆయన పాలనలోనే కరువు కాటకాలు ఉన్నాయని గుర్తుచేశారు. నాడు–నేడు అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ఈ కామర్స్‌లో రాష్ట్రం ముందుందని, 17 మెడికల్ కళాశాలలు, ఆరు పోర్టుల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయని, ఇది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. రాజధాని నిర్మాణం అంటూ చంద్రబాబు 5వేల కోట్లు భూమిలో పోశారని ఎద్దేవా చేశారు. 2 లక్షల సచివాలయ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. స్థానికంగా ఉన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కుటుంబం ఏనాడూ పేదవారికి అందుబాటులో లేదని చెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రం కుంకుమ భరిణతో ప్రేమ ఒలకబోస్తూ పెళ్లిళ్లకు, చావులకు వచ్చేస్తారని ఎన్నికలైన వెంటనే హైదరాబాద్‌కు చెక్కేస్తారని ఎద్దేవా చేశారు. ఇలాంటి వారి ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేదని స్పష్టం చేశారు. నిత్యం అందుబాటులో ఉండే తమకు ప్రజల మద్ద తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వాసునాయుడు, బర్రె హేమభూషణ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కోవి చంద్రయ్యానాయుడు, జనార్ధన్, గోవిందరెడ్డి, ఎంపీడీవో రఫీఖాన్, సురేష్‌బాబు, ఏపీవోలు సుజాత, దినేష్, దేవరి పాల్గొన్నారు.

సంక్షేమ సారధితోనే మేమంతా

రేణిగుంట: పేద ప్రజల సంక్షేమమే పరమావధిగా, పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న సంక్షేమ సారధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటే తామంతా ఉంటామని గాజులమండ్యం వాసులు స్పష్టం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మండలంలోని గాజులమండ్యంలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. నవరత్న పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ప్రతి ఇంటా ఆయన్ను సాదరంగా ఆహ్వానించి జగనన్న పాలనలో తామంతా సుభిక్షంగా ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా అర్హులై ఉండి సాంకేతిక కారణాల చేత పథకాలు అందకుంటే వారి ఫిర్యాదులను ప్రత్యేకంగా స్వీకరించి 'ప్రజాదర్బారు' కార్యక్రమం ద్వారా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల మెరుగు చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తానని మాటిచ్చారు. ఆయన గడప గడపకు వెళ్లగా, ప్రజలే స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీ జెండాను చేత పట్టుకుని ఎమ్మెల్యేకు చూపుతూ స్వాగతం పలికారు. తామంతా జగనన్న సంక్షేమ పాలనలో లబ్ధి పొందామని, విద్య, వైద్య రంగాల్లో గతంలో ఎన్నడూ లేనంతగా మార్పులను తీసుకొచ్చారని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. జగనన్న గడప గడపకు కార్యక్రమం తలపెట్టి ఎమ్మెల్యేల గ్రాఫ్‌ను అమాంతం పెంచారని వెల్లడించారు. ప్రతి గడపలోనూ పార్టీలకతీతంగా జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాయని ప్రజలు సంతోషంగా చెబుతుంటే వినడానికి ఆనందంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీతో ఎన్ని పార్టీలు కలసి వచ్చినా జగనన్నకు క్షేత్రస్థాయిలో ప్రజల దీవెనలు మెండుగా ఉన్నాయని పేర్కొన్నారు. 175కు 175 స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట ఎంపీపీ హరి ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీ సభ్యులు వెంకటరమణారెడ్డి, జువ్వల ధనంజయరెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి, పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, బెనర్జీ, శ్రీనుయాదవ్, మోహన్‌రెడ్డి, కుమార్, వేణుగోపాల్, విజయభాస్కర్ రెడ్డి, శేఖర్‌యాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బాలయ్య

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. వినియోగదారుల ఫోరం క్లబ్‌లను పాఠశాల స్థాయిలో ఏర్పాటు చేసేందుకు శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలో ప్రతి పాఠశాల నుంచి సాంఘికశాస్త్ర ఉపాధ్యాయునికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంఈవో బాలయ్య మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు సమయంలో అన్ని విషయాల్లో అవగాహన కలిగి ఉండాలన్నారు. వస్తువు నాణ్యత, ధర, మన్నిక, బిల్లు, గ్యారెంటీ తదితర విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ విషయాలను పాఠశాలల్లో ప్రతి విద్యార్థికే చేరేలా చూడాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు కాపాడినపుడే వస్తువుల నాణ్యత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ, కేవీబీపురం, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలకు చెందిన 74మంది సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు సురేష్, రవిచంద్ర, చిరంజీవి, వేణు, విజయ, మంగీలాల్, బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సమాన అవకాశాలు కల్పిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న తులసీరాంరెడ్డి

రేణిగుంట: బాలికలు, మహిళలకు అన్ని రంగాల్లో పురుషులతో సమానమైన అవకాశాలను కల్పించి ప్రోత్సహించాలని ప్రగతి సంస్థ కో–ఆర్డినేటర్ తులసీరామ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరకంబాడి పంచాయతీ ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల భవిష్యత్తు నాశనమవుతోందన్నారు. పేదరికం, నిరక్షరాస్యత వల్లే ఇలాంటి మూఢాచారాలు నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. బడి ఈడు పిల్లలందరూ చదువుకోవాలని, బాలకార్మిక వ్యవస్థను ఎవరైనా ప్రోత్సహిస్తే కఠిన శిక్షలు ఉన్నాయని గుర్తుంచుకోవాలన్నారు. హెచ్ఎం దేవసేన మాట్లాడుతూ బాలికలు, మహిళలకు సమాన అవకాశాలిచ్చి, వారి భద్రతకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, ప్రగతి మండల కో–ఆర్డినేటర్ జయలక్ష్మి, చైతన్యపురం స్కూల్ ఉపాధ్యాయుడు లోకనాథం, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపంతో రక్త హీనత

ఏర్పేడు: కిశోర బాలికలలో పౌష్టికాహార లోపంతో రక్త హీనత కలుగుతుందని రేణిగుంట ప్రాజెక్ట్ సీడీపీఓ కృష్ణమంజరి తెలిపారు. మండలంలోని పల్లం సచివాలయంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అందులో ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు తాజా ఆకుకూరలు, కూరగాయలు, పప్పు దినుసులతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, వైఎస్సార్ సీపీ నాయకుడు బత్తెయ్య, ప్రగతి సంస్థ మండల కన్వీనర్ శిరీషా, పంచాయతీ కార్యదర్శి గోపి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమంజరి

ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పుత్తూరు రూరల్: పట్టణంలోని ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్లగుంట నుంచి సంరక్షకుడుగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకుంది. గెరిగ నీటితో అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం గోపూజ, శ్రీకృష్ణుడికి పాలాభిషేకం చేశారు. సాయంత్రం 5 గంటల వరకు హరికథా గానం జరిగింది. సాయంత్రం 6 గంటలకు సుమంగళి వ్రతం, కుంకుమార్చన, జ్యోతిపూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి 8 గంటలకు గెరిగ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంది. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. 9 గంటలకు ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. 10 గంటలకు పట్టణానికి చెందిన శ్రీబాలాజీ వీధి నాట్య కళా బృందం ప్రదర్శించిన శశిరేఖ పరిణయం నాటకం అలరించింది.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన మునిరెడ్డి, లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సొమ్మును టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు స్వీకరించారు. దాతకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: మండలంలోని గొల్లపాళెంలో నాడు–నాడు నేడు పనులను ఎంఈఓ–1 రవి పరిశీలించారు. గొల్లపాళెంలో రూ.13 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం పనులు జరుగుతున్నాయి. శుక్రవారం ఎంఈఓ–1 రవి అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బి. ప్రభావతి పాల్గొన్నారు.

అటవీ హక్కుల చట్టం అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు, సీపీఐ నాయకులు

వరదయ్యపాళెం: మండలంలోని ఎంజీనగర్ గిరిజనకాలనీ వాసులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం శ్మశాన స్థలాన్ని కేటాయించాలని సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంజీనగర్‌లో శ్మశాన వాటికకు వినియోగించుకుంటున్న స్థలం వద్ద స్థానికులతో కలిసి నిరసన తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి తరుణ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి చంద్ర పాల్గొన్నారు.

విజయ గణపతి ఆలయంలో ఎమ్మెల్సీ



విజయ గణపతి ఆలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరి గ్రామంలో నూతనంగా నిర్మించిన విజయ గణపతి ఆలయంలో శుక్రవారం గణపతి, నవగ్రహ, వాస్తు హోమం, వాస్తు శాంతి, వాస్తు పూజ నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్తులు విరాళాలతో ఆలయాన్ని నిర్మించి కుంభాభిషేకం పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం జరగనుంది. సర్పంచ్ మునిరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కేశవులురెడ్డి, బాలకృష్ణారెడ్డి, కుమార్‌రెడ్డి, మునిరత్నంరెడ్డి, వీరరాఘవరెడ్డి, వెంకటస్వామిరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం



పిచ్చాటూరులో సిబ్బందికి సూచనలు ఇస్తున్న పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు

పిచ్చాటూరు: మండలంలోని అడవి కొడియంబేడు సర్పంచ్, గోవర్ధనగిరి 7వ వార్డు ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఎన్నికల సామగ్రితో పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎంపీడీఓ కార్యాలయం నుంచి బయలుదేరి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎంపీడీఓ మాట్లా డుతూ శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తామన్నారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ఆపై ఫలితాలు వెల్లడించనున్నట్లు ఆయన వివరించారు. సర్పంచ్‌కు అడవి కొడియంబేడు ఎంపీపీ పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లు, వార్డు సభ్యుని ఎన్నికలు నారాయణరాజుకండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో ఒక బూత్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు జరిగే అడవికొడియంబేడు, గోవర్ధనగిరి గ్రామాల్లో 97 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికలకు కేటాయించిన పోలీసు అధికారులు, సిబ్బందితో శుక్రవారం మధ్యాహ్నం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశమయ్యారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఆయన వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ జరిగే గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. అనంతరం పోలింగ్ జరిగే గ్రామాలకు పోలీసులు చేరుకుని సాయంత్రం 4 గంటలకు పోలీసు కవాతు నిర్వహించారు. సత్యవేడు, పుత్తూరు సీఐలు శివకుమార్ రెడ్డి, సురేష్‌కుమార్, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం



ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చేనేత సంఘం ఆధ్వర్యంలో ధ్వజారోహణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు వివిధ రకాల అభిషేకాలతో విశేష పూజలు చేశారు. ముందుగా పురవీధుల్లో పోతురాజును ఊరేగించి పూజలు చేశారు. శుక్రవారం రాత్రి శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, చేనేత సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం: మండలంలోని రాజుల కండ్రిగ గ్రామ పంచాయతీకి చెందిన కడివేడు సచివాలయ కన్వీనర్ గణేష్‌రాజు భార్య విజయమ్మ. ఈమె చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. విషయం తెలిసి శుక్రవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మృతురాలి స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించారు. గణేష్‌రాజును ఓదార్చి తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

ప్రశాంతతను చెడగొట్టడమే టీడీపీ ధ్యేయం

- కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారు
- ఓటుతో కుట్ర రాజకీయాలను తిప్పికొట్టాలి
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



పిచ్చాటూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: గ్రామాల్లో ప్రశాంతతను చెడగొట్టాలన్నదే ప్రతిపక్ష టీడీపీ ధ్యేయంగా కనిపిస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం పిచ్చాటూరులో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవికొడియంబేడు గ్రామంలో సర్పంచ్ పుష్పవతి హఠాన్మరణం వల్ల ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఆ స్థానంలో మృతురాలి కుమారుడు కిరణ్‌కుమార్‌ను మానవతా దృక్పథంతో ఏకగ్రీవం చేయకుండా పోటీ పెట్టి గ్రామంలో అశాంతి నెలకొనే విధంగా టీడీపీ వ్యవహరించిందన్నారు. అలాగే గోవర్ధనగిరిలో సైతం వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు మరణిస్తే ఆ స్థానానికి పోటీ పెట్టి సమస్యలు సృష్టించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల ప్రచారానికి జాతీయ స్థాయి, జిల్లా స్థాయి నాయకులను తీసుకొచ్చి ప్రశాంతతకు భంగం కలిగించాలని ప్రయత్నించడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. గ్రామాల్లో కులాల మధ్య చిచ్చుపెట్టి తద్వారా తమ రాజకీయ ఉనికిని చాటుకోవాలని ప్రతిపక్ష టీడీపీ చూస్తోందన్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి టీడీపీ కుట్రలను ధీటుగా ఎదుర్కోవాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించాలని, ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసుకునే వాతావరణం కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. టీడీపీ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, శనివారం జరిగే పోలింగ్‌లో టీడీపీకి ఓట్ల రూపంలో తగిన బుద్ధి చెప్పి ఇంటికి పంపిస్తారన్నారు. అడవికొడియంబేడులో మంచం గుర్తుపై ఓటేసి సర్పంచ్‌గా కిరణ్‌కుమార్‌ను గెలిపించాలని, గొను గుర్తుపై ఓటేసి గోవర్ధనగిరి 7వ వార్డు సభ్యునిగా బాలసుబ్రమణ్యం రాజును గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ సభ్యులు శోభన్‌బాబు, రమేష్ రాజు, మాజీ వైస్ ఎంపీపీ పాలపద్మనాభం, నేతలు చలపతిరాజు, చెంగల్రాయరెడ్డి, సుబ్రమణ్యం, గోవిందస్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన

- వ్యక్తికి జైలుశిక్ష



బాలసుబ్రమణ్యంను అరెస్టు చేసిన పోలీసులు

సత్యవేడు: స్థానిక శ్రీకాళహస్తి బస్టాండులో పెద్ద ఈటిపాకం గ్రామానికి చెందిన మహిళ కుటుంబసభ్యులతో కలసి బస్సు కోసం వేచి ఉండగా, సత్యవేడు బీసీ కాలనీకి చెందిన బాలసుబ్రమణ్యం అసభ్యంగా ప్రవర్తించారని సదరు మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు ఎస్ఐ పురుషోత్తంరెడ్డి కేసు నమోదు చేసి అతన్ని అరెస్టు చేశారు. శుక్రవారం నిందితుడిని కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండుకు పంపారని ఎస్ఐ తెలిపారు.